చెరువులు, కుంటలను పరిరక్షిస్తాం

సుల్తానాబాద్ : చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, అక్టోబర్ 15 : చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికాకుండా కాపాడుతామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల కోసం ఉచిత చేప పిల్లల పంపిణీ చేయగా, మంగళవారం సుల్తానాబాద్ పెద్ద చెరువులో రూ. 8 లక్షల విలువైన చేప పిల్లలను చెరువులోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. చెరువులు, కుంటల పరిరక్షణకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిబంధనలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమతా కృష్ణ, మత్స్యశాఖాధికారి భాస్కర్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు మినుపాల ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, సాయిరి మహేందర్, ముస్త్యాల రవీందర్, వేగోళం అబ్బయ్యగౌడ్, చిలుక సతీష్, దన్నాయక్ దామోదర్‌రావు, కుమార్ కిషోర్, అమిరిశెట్టి తిరుపతి, కొలిపాక నర్సయ్య, కలువల శ్రీనివాస్, గరిగె శ్రీనివాస్, డైరెక్టర్లు, మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే విజయ రమణరావు పరిశీలించారు.పట్టణంలోని అన్నీ రోడ్ల వెడల్పుతో పాటు, కాల్వశ్రీరాంపూర్ రహదారిని డబుల్ రోడ్డు విస్తరించడంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 15: మహిళా సంఘాల సభ్యులంతా బ్యాంకుల సహకారంతో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఆర్థికంగా ఎదగాలని పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన భవన సముదాయంలో ఏర్పాటు చేసిన శ్రీ హనుమాన్ ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప సురేందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, ఎంపీడీవో శ్రీధర్, ఏపీఎంలు సంపత్, దివ్య, మాజీ జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, జడల సురేందర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, భూతగడ్డ సంపత్, గుర్రాల రాజు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెద్దపల్లి టౌన్, అక్టోబర్15: పెద్దపల్లి ప్రణాళివృద్ధికి రూ. 30 కోట్లు కేటాయించి డ్రైనేజీ, బీటీ, సీసీ రోడ్లు వంటి పనులు చేపట్టానున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. పట్టణంలోని 26,27, 28 వార్డుల్లో మంగళవారం టీయూఎఫ్ ఐడీసీ నిధుల ద్వారా రూ. 1.27 కోట్ల విలువైన పనులకు ఎమ్మెల్యే విజయ రమణారావు శంకుస్థాపన చేశారు. ఇక్కడ పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎలువాక రాజయ్య, కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య,ఉల్లెందుల కృష్ణమూర్తి, భూతగడ్డ సంపత్, తూముల సుభాష్‌రావు, పోతని పురుషోత్తం, నాయకులు దొడ్డుపల్లి జగదీశ్, బోడ్డుపల్లి శ్రీనివాస్, శరత్ శారద, నాయకులు పాల్గొన్నారు.

వైద్యులు సమయ పాలన పాటించాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి టౌన్ : నోటీసు బోర్డును పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి టౌన్, అక్టోబర్15 : ప్రభుత్వ డాక్టర్లు సమయ పాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం చూపవద్దని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ దవాఖాన, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. అవుట్, ఇన్, పేషెంట్స్‌కు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు తప్పకుండా విధుల్లో ఉండాలని ఆదేశించారు. డ్యూటీ సమయంలో ప్రైవేట్ క్లీనిక్‌లు నిర్వహిస్తే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశబూరు. ఆయా ప్రైవేట్ వైద్యశాలలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. దవాఖానకు వచ్చే అవుట్, ఇన్ పేషెంట్ల వివరాలు, హాజరైన పేషెంట్ల సంఖ్య నమోదు చేయాలని, డ్యూటీ డాక్టర్ల వివరాలు నోటీస్ బోర్డులో ఉండాలని డీసీహెచ్ఎస్ శ్రీధర్‌ను మందలించారు. వైద్యులకు సెలవు కావాలంటే ముందుగానే డీసీహెచ్ఎస్, సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చి సెలవు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ ఆర్ఎంఓ రవీందర్, డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీకి సిద్ధం చేయాలి

పెద్దపల్లి, అక్టోబర్15: పెద్దపల్లి పట్టణ పరిధిలోని చందపల్లి, రాంపల్లికాలనీలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అవసరమైన మౌలిక వసతులు తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ పనులు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేసి, లబ్ధిదారులు గృహప్రవేశం చేసేలా చూడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ బావ్‌సింగ్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ నియంత్రణకు చేపట్టిన చర్యలపై కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మత్తు పదార్థాల నియంత్రణ చర్యలు, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలోని విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల అలవాటు ఉన్న వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు పంపించాలన్నారు. గోదావరిఖని ప్రభుత్వ దవాఖానలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశామని, అవసరమైన వారికి చికిత్స అందించాలన్నారు. పెద్దపల్లి, గోదావరిఖని ఏసీపీలు గజ్జి కృష్ణ, ఎం రమేశ్, జిల్లా అటవీ అధికారి సీహెచ్ శివయ్య, జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, డీఈవో మాధవి, జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్ , జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దాసరి కల్పన, కలెక్టరేట్ పర్యవేక్షకులు బండి ప్రకాశ్, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

పెద్దపల్లి, అక్టోబర్15: జిల్లాలో పత్తి కొనుగోలుకు వ్యవసాయ మార్కెట్ అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నేటి నుంచి పత్తిని కొనుగోలు చేయనున్నారు. జిల్లాలోని నాలుగు జిన్నింగ్ మిల్లులతో పాటు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోలు చేయనున్నారు. పెద్దపల్లి ఏఎంసీ పరిధిలో 2, సుల్తానాబాద్, కమాన్‌పూర్ ఏఎంసీ పరిధిలో ఒక్కొక్కటి చొప్పున జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ప్రభుత్వం క్వింటాల్ పత్తి కనీస మద్దతు ధర రూ. 7521 (8 శాతం తేమ) నిర్ణయించింది. సీసీఐ కూడా కనీస మద్దతు ధరపై పత్తి కొనుగోలు చేయనున్నది. జిల్లాలో పండించిన పత్తిని కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పెద్దపల్లి డీఎంవో పీ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. పెద్దపల్లి ఏఎంసీతో పాటు నాలుగు జిన్నింగ్ మిల్లుల్లోల కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.

పొత్కపల్లి ఠాణా తనిఖీ

ఓదెల, అక్టోబర్ 15: పొత్కపల్లి ఠాణాను పెద్దపల్లి డీసీపీ చేతన మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను ఎస్ఐ అశోక్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. డీసీపీ వెంట ఏసీపీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి ఉన్నారు.

టీ ఫైబర్ సేవలను సద్వినియోగం చేసుకోండి

రామగిరి, అక్టోబర్ 15: వ్యవసాయ రంగంలో నూతన విప్లవం కోసం తీసుకవస్తున్న టీ ఫైబర్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రత్నాపూర్ రైతు వేదికలో మంగళవారం అధికారులు, రైతులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంథని ఏడీఏ అంజనీ, కేవీకే శాస్త్రవేత్తలు, ఏఈవోలు, పాల్గొన్నారు.

ఖని దవాఖానలో పనిచేయని లిఫ్ట్

దవాఖానలో పనిచేయని లిఫ్ట్

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 15: రోగుల తాకిడితో కిక్కిరిస్తున్న గోదావరిఖని ప్రభుత్వ జనరల్ దవాఖానలో మూడు రోజులుగా లిఫ్ట్ పనిచేయకపోవడంతో రోగులు, వైద్యులు ఇబ్బందులకు గురవుతున్నారు. సాంకేతిక సమస్యతో లిఫ్ట్ సేవలు నిలిచిపోగా రిపేరు చేయాల్సిన టెక్నీషియన్ దూర ప్రాంతం నుంచి రావాల్సి ఉండగా లిఫ్ట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. దవాఖానపై విభాగంలో ఎముకలు, ఈఎన్‌టీ, పీడియాట్రిషియన్ విభాగాలు ఉండడంతో రోగులు పైఅంతస్తుకు వెళ్లందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. అధికారులు ఇప్పటికైన త్వరితగతిన లిఫ్టను బాగు చేయించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

'మల్టీ డిపార్టుమెంటల్' సమావేశం

గోదావరిఖని, అక్టోబర్ 15: జీడీకే 1,3 ఇంక్లైన్‌లో పని చేస్తున్న ఉద్యోగులతో మన సంస్థ, మన గని, మన బాధ్యతలను వివరించే మల్టీ డిపార్టుమెంటల్ సమావేశం ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ బలరాం సందేశాత్మక వీడియోను ప్రదర్శించారు. సింగరేణి సంస్థ పురోభివృద్ధికి సాధించాల్సిన అంశాల గురించి వివరించారు. ఇక్కడ గని ఏజెంట్ 1 ఎల్ రమేశ్, గ్రూపు ఏరియా రమేశ్, ఇంజినీర్ సాయిప్రసాద్, ఏఎస్వో డీ రమేశ్, ఎస్‌వోఎం రాజన్న, ఐఈడీ ఇంజినీర్ ఎం రవీందర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ ఇక్బాల్ షరీఫ్, కే శ్రీనివాస్, మల్లేశం, రంగు శ్రీను, ఎగ్జిక్యూటీవ్ స్టాఫ్, సూపర్‌వైజర్ స్టాఫ్, టెక్నీషియన్స్ ఉన్నారు.

కులవివక్ష చూపుతున్న అధికారి

గోదావరిఖని, అక్టోబర్ 15: ప్రభుత్వ అనుమతులతో ఇల్లు నిర్మించుకున్న పోలీస్ కానిస్టేబుల్ అర్నకొండ సదానందంను ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుగా గోడ పెట్టించిన సింగరేణి ఆర్జీ–1 ఎస్టేట్ ఆఫీసర్ సాంబశివరావు కులవివక్ష చూపుతున్నారని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆరోపించారు. పట్టణంలోని అర్నకొండ సదానందం ఇంటికి వెళ్లిన నాయ కులు ఇటీవల ఎస్టేట్ ఆఫీసర్ అడ్డుగా పెట్టించిన గోడను పరిశీలించి మాట్లాడారు. ఇప్పుడా ఆఫీసర్ తన తప్పులను కప్పిపుచ్చు కునేం దుకు పోలీస్‌స్టేషన్‌లో కౌంటర్‌గా తప్పుడు కేసులు పెడుతు న్నట్లు తెలిపారు. ఇక్కడ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, కార్పొరేటర్ అయిత శివ, నాయకులు వెంకన్న, కనుకుంట్ల రమేశ్ ఉన్నారు.

పిట్ సెక్రటరీ సంపత్‌కు నివాళి

గోదావరిఖని, అక్టోబర్ 15: జీడీకే 11ఏ గని ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ మోదుల సంపత్ అకాల మృతిపై యూనియన్ నాయకులు నివాళులర్పించారు. మంగళవారం స్థానిక ఉదయ్‌నగర్‌లో ఇంటివద్ద సంపత్ పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు వేసి నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. సింగరేణి ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచీ కార్యదర్శి ఆరెల్లి పోశం, కేంద్ర కార్యదర్శి కే స్వామి నివాళులర్పించారు.

విద్యుత్ అధికారుల బదిలీలు

జూలపల్లి, అక్టోబర్ 15 : జూలపల్లి మండల విద్యుత్ శాఖ ఏఈ అశోక్ కమాన్‌పూర్ మండలానికి బదిలీపై వెళ్లారు. గోదావరిఖని నుంచి హరీశ్ ఇక్కడికి ఏఈగా బదిలీపై వచ్చారు. సబ్ ఇంజినీర్ గడ్డం సాయినాథ్‌రెడ్డి సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి, లైన్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ ఎలిగేడుకు, లైన్‌మెన్లు పల్లెర్ల అంజయ్య కాల్వశ్రీరాంపూర్‌కు, రాజేశం బొంపెల్లికి బదిలీపై వెళ్లారు.

ఖని'లో ఆకట్టుకుంటున్న చేనేత ప్రదర్శన

స్టాల్స్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న మహిళలు

కోల్‌సిటీ, అక్టోబర్ 15: గోదావరిఖని జీఎం ఆఫీసు కాలనీ సింగరేణి ఆర్జీ–1 కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన చేనేత హస్త కళా ప్రదర్శన ఆకట్టుకుంటున్నది. దేశంలోని దాదాపు 10 రాష్ట్రాల నుంచి చేనేత దుస్తుల అమ్మకాలతోపాటు, మగువల మనసును దోచే ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇక్కడ వివిధ ప్రాంతాల వస్తువులు, తెలంగాణలోని గద్వాల, నారాయణపేట, పోచంపల్లితో పాటు ఇతర ప్రాంతాల డ్రెస్ మెటీరియల్, చీరలు ఆకట్టుకుంటున్నాయి. ప్రధానంగా నేత కార్మికులు తమ స్వహస్తాలతో తయారు చేసిన చీరలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతిదానిపై 60 శాతం డిస్కౌంట్ కల్పించడంతో పారిశ్రామిక ప్రాంత ప్రజలు కొనుగోళ్లకు ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. త్వరలోనే ఎగ్జిబిషన్ ముగియనున్నందున ప్రజలు త్వరపడి సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు సంజీవ్ కోరారు.

మంథని ఆర్డీవో సరెండర్

మంథని, అక్టోబర్ 15: మంథని ఆర్డీవో హనుమానాయక్‌కు హైదరాబాద్ భూపరిపాలన ప్రధాన కమిషనర్‌కు సరెండర్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్డీవో హనుమానాయక్ నిధుల దుర్వినియోగం, నేషనల్ హైవే ఆథారిటీ, భూసేకరణ, ఆర్అండ్ఆర్‌లతో పాటు సాధారణ ఫిర్యాదులకు హాజరు కావడంలో నిర్లక్ష్యం వహించడం, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో ఆలస్యం, కోర్టు ఆదేశాలను పాటించడం లేదని పేర్కొంటూ హనుమానాయక్‌ను సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా మంథని ఇంచార్జి ఆర్డీవోగా పెద్దపల్లి ఆర్డీవో గంగయ్యకు ఆదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కార్మికుల ఐక్యత కోసమే బడాఖాన

గోదావరిఖని, అక్టోబర్ 15: సింగరేణి కార్మికుల ఐక్యత కోసమే గనుల వద్ద బడాఖాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సింగరేణి ఆర్జీ–1 ఏరియా సీహెచ్‌పై మంగళవారం బడాఖాన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు బొంతల రాజేశ్, తిప్పారపు శ్రీనివాస్ ఉన్నారు.

ఓసీపీ 5లో బడాఖాన

జీడీకే ఓసీపీ –5లో ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర పేరిట బడాఖాన సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించారు. మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ పాల్గొని సహపంక్తి భోజనాలను ప్రారంభించారు. ఇక్కడ పీఓ చంద్రశేఖర్, డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని ప్రకాశ్, అధికారులు రమేశ్‌బాబు, రమేశ్, అనిల్ గాబాలే, శ్రీనివాస్, పీసీ పటేల్ కంపెనీ రవీదర్, నాయకులు ప్రభుదాస్, సదానందం, సంక్షేమాధికారి ఫిరోజ్‌ఖాన్ ఉన్నారు.

జోనల్ రెస్క్యూ పోటీలకు సిద్ధం

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 15: సింగరేణి సంస్థ 53వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలకు ఆర్జీ–2 ఏరియాలోని మెయిన్ రెస్క్యూ స్టేషన్ ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, రెస్క్యూ జీఎం శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి రెస్క్యూ స్టేషన్‌లో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 16,17 తేదీల్లో పోటీలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. గనిలో ప్రమాదం జరిగినప్పుడు రెస్క్యూ సభ్యులు చేపట్టే ఆపరేషన్ 7ఎల్ఈపీ గనిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో రెస్క్యూ మేనేజర్ బింగి మాధవరావు, డీజీఎం(ప) అనిల్ కుమార్, డీజీఎం (సి) ధనుంజయ్, డీజీఎం(ఎ) ఎర్రన్న, ఐఈడీ మురళీకృష్ణ, రాజేందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీల్డ్ టెండర్లకు ఆహ్వానం

పెద్దపల్లి, అక్టోబర్15: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాలిథిన్ బ్యాగుల సేకరణ, సరఫరాకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఆర్డీవో రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్డీవో పేరు మీద రూ. 2వేలు డీడీ చెల్లించి ఈనెల 16,17వ తేదీల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు పొందాలని సూచించారు.

సొసైటీ సందర్శన

సుల్తానాబాద్, అక్టోబర్ 15 : సుల్తానాబాద్ సొసైటీని లక్నో నాబార్డు అధికారులు రజని పాండే, ప్రశాంత్ దూబే మంగళవారం సందర్శించారు. రైతులకు అందుతున్న సేవలను పరిశీలించారు. సంఘం అధ్యక్షుడు శ్రీగిరి శ్రీనివాస్ రైతులకు అందిస్తున్న సేవలు, చేస్తున్న వ్యాపారం గురించి వివరించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం జయప్రకాశ, బ్యాంక్ డిప్యూటి జనరల్ మేనేజర్ బ్రహ్మానందరావు, రిసోర్స్ పర్సన్ ఎన్ వెంకటేశ్వర్లు, బ్యాంక్ మేనేజర్ కే శశిధర్‌రావు, సంఘ కార్యదర్శి బూరుగు సంతోష్, సొసైటీ సిబ్బంది తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి అంకురార్పణ

పాలకుర్తి, అక్టోబర్15: బసంత్‌నగర్ ఉన్నత పాఠశాల 50 వసంతాలు పూర్తి అవుతున్న సందర్భంగా అలుమిని2024 పేరుతో 1984 ఎస్సెస్సీ మొదటిబ్యాచ్ నుంచి –1994 వరకు పదేళ్ల పూర్వవిద్యార్థులు ఈనెల 20న ఒక్కచోట అలుమిని 2024 సంబరాలు జరుపుకోనున్నారు. ఈసందర్భంగా మంగళవారం పాఠశాల హెచ్ఎం గాయత్రికి 30 కుర్చీలు, కార్డులెస్ మౌత్‌సౌండ్ సిస్టమ్ అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కళోత్సవ్ పోటీల్లో పాల్గొనండి

పెద్దపల్లి కమాన్, అక్టోబర్ 15 : ఎన్సీఈఆర్టీ ఢిల్లీ, రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించే కళోత్సవ్–2024 జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని డీఈవో డీ మాధవి కోరారు. స్వర సంగీతం (గానం), వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్ (నాటకం), దృశ్య కళ, సంప్రదాయక కథ చెప్పడం అంశాలపై ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో సుమారు 50 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. వీరికి ఈ నెల 17న ఉదయం 10 గంటలకు పెద్దపల్లి ఎంఆర్సీ భవన్‌లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను నవంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విధుల్లోకి నూతన టీచర్లు

- 73 మందికి పోస్టింగ్ ఆర్డర్లు

పెద్దపల్లి కమాన్, అక్టోబర్ 15 : డీఎస్సీ–2024 ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలల్లో పోస్టింగ్‌లు కేటాయించినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఇటీవల హైదరాబాద్‌లో నియామక పత్రాలు అందుకున్న 73 మంది కొత్త టీచర్లకు మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం పోస్టింగ్ పత్రాలు అంజేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డీఈవో డి. మాధవి, విద్యాశాఖాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

24గంటల్లో 20 ప్రసవాలు

- ఖని ప్రభుత్వ దవాఖాన రికార్డు

పుట్టిన బిడ్డలతో తల్లులు, వారి కుటుంబ సభ్యులు

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 15: గోదావరిఖని ప్రభుత్వ దవాఖాన ప్రసవాల్లో రికార్డు సృష్టించింది. కేవలం 24గంటల్లో 20 ప్రసవాలు చేసి రికార్డులను తిరిగిరాసింది. హాస్పిటల్ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని ప్రభుత్వ దవాఖనాలో మంగళవారం ఉదయం 8 గంటలకు డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ శిరిష, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ వెంకటలక్ష్మీ, మత్తు వైద్యుడు అనిల్ ఆధ్వర్యంలో నర్సింగ్ సిబ్బందితో కలిసి 20మందికి ప్రసవాలు చేయగా తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. వీరిలో ఐదు సాధారణ ప్రసవాలు, 15 ఆపరేషన్లు నిర్వహించారు. వీరిలో ఏడుగురు మగ పిల్లలు పుట్టగా, 13మంది ఆడపిల్లలు పుట్టారు. దవఖానలో రోజుకు 25మందికి ప్రసవాలు జరిగేలా వసతులు ఉన్నట్లు డాక్టర్ అరుణ తెలిపారు.

కొనసాగుతున్న ప్రైవేట్ కళాశాలల బంద్

పెద్దపల్లి కమాన్: గాయత్రి డిగ్రీ-పీజీ కళాశాల ముందు నిరసన తెలుపుతున్న అల్లెంకి శ్రీనివాస్, అధ్యాపకులు

పెద్దపల్లి కమాన్, అక్టోబర్ 15 : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల నిధుల విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమ, మంగళవారాల్లో జిల్లా వ్యాప్తంగా పలు యాజమాన్యాలు కళాశాలలను మూసివేసి నిరవధిక బంద్‌లో పాల్గొన్నాయి. పెద్దపల్లి గాయత్రి డిగ్రీ,పీజీ కళాశాల ముందు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కో–ఆర్డినేటర్ అల్లెంకి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధ్యాపకులు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు బకాయిలు విడుదల చేసి, యాజమాన్యాలు, అధ్యాపకులు, సిబ్బందికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 15: ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పలు డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ నిర్వహించాయి. విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని వారు కళాశాల గేట్‌పై ఏర్పాటు చేసిన ప్లెక్సీబోర్డులో పేర్కొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 15: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా పెద్దపల్లిలో పేపర్ డిస్ట్రిబ్యూషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పెద్దపల్లి ఎంపడీవో కార్యాలయం ఆవరణలోని అమరుల స్తూపం వద్ద అబ్దుల్ కలాం చిత్రపటానికి ఎమ్మెల్యే విజయరమణారావు, పేపర్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ బొడ్డపల్లి శ్రీనివాస్, దిడ్డి రాజయ్య, అంజయ్య, సాబీర్‌పాషా, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి కమాన్, అక్టోబర్ 15 : పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్‌లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ అల్లెంకి రజినీ, ప్రిన్సిపాల్ విజయ్, రజియొద్దీన్, సృజన, స్రవంతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కోల్‌సిటీ, అక్టోబర్ 15: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని గోదావరిఖనిలోని మార్కండేయ కాలనీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు ఈదునూరి శంకర్, ఇన్‌కం టాక్స్ ఆడిటర్ ఇబ్రహీం, నాయకులు గోవర్ధన్, చంద్రశేఖర్, జనగామ శరత్‌బాబు, మాదరబోయిన శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

పెద్దపల్లి, అక్టోబర్15: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్ –2024లో భాగంగా పెద్దపల్లిలోని యూపీహెచ్‌సీలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. సుఖ వ్యాధులు, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ఐసీటీసీ కౌన్సిలర్ జీ శంకర్, వైద్యురాలు స్వప్న, ల్యాబ్ టెక్నీషియన్ అభిరామ్, ఏఎన్ఎంలు మాధవి, భవాని, వరలక్ష్మి, శారద, ఆశాలు రేణుక, మరియా, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆర్జీ–3 వాహన టెండర్లలో గోల్‌మాల్

రామగిరి, అక్టోబర్ 15: ఆర్జీ–3 పరిధిలోని సింగరేణి వాహన టెండర్లలో గోల్‌మాల్ జరుగుతుందని భూ నిర్వాసితులు బాధితులు పొన్నం బాలకృష్ణ, మేడగోని నరేందర్ మంగళవారం సెంటినరీకాలనీలో విలేకరులతో తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆర్జీ–3 డివిజన్ పరిధిలో జీఎం సుధాకర్ రావు, పర్చేజ్ అధికారి నాగేశ్వరరావు భూ నిర్వాసితులు వాహనాల టెండర్లలో చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. విచారణ జరిపి భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని సింగరేణి సీఎండీతోపాటు డైరెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

లక్కారంలో కాపు సంఘం ఎన్నిక

ముత్తారం, అక్టోబర్ 15: లక్కారంలో కాపు సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గుమ్మడి రాజయ్య, ఉపాధ్యక్షునిగా సిరంగి రమేష్, కోశాధికారిగా బర్ల సంతోష్, ప్రధాన కార్యదర్శిగా కొప్పుల మల్లయ్య, సహయ కార్యదర్శిగా గోపిశెట్టి వేణు, కార్యదర్శిగా సాతిని రాజేశ్వరి, సభ్యులుగా బర్ల సదన్, గుమ్మడి శ్రీను ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాపుసంఘం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I, CH. ANJALI W/o. CHENNAMANENI RAVINDER, R/o. H.No. 1-5-197/18/5, Ravindranath Tagur Nagar, Jagitial. Telangana. Have Changed My Name as **CHENNAMANENI MADHURI**

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

JYOTHISHMATHI COLLEGE OF EDUCATION
RAMAKRISHNA COLONY, NUSTULAPUR.
Karimnagar-505527 Cell:9177553535
'B' CATEGORY NOTIFICATION FOR B.Ed. COURSE (2024-25)
Applications are Invited from Qualified candidates for Admission Into B.Ed.Course under category 'B' in All Subjects.
Prescribed Application Forms can be had from the College Office and the same may be submitted to the Principal on or before 21.10.2024
Sd/- Secretary & Correspondent